# విధిలిఖితము

ఏకశిలానగరమును రాజధానిగ చేసుకొని ఆంధ్ర సామ్రాజ్యమును కాకతీయ వంశీయుడగు ప్రోలరాజు పరిపాలించుచుండెను. ప్రోలరాజునకు లేక లేక తేజశ్శాలియగు పుత్రుడు జన్మించెను. పుత్రోత్సవపు వేడుకలలో గొప్ప దర్బారు జరిగెను. గొప్పగొప్ప జ్యోతిష్కులా సభకు వచ్చిరి. రాజు వారితో నేకాంతమున కుమారుని జాతకము గురించి ప్రశ్న వేసెను. వారొక్కింత తడవేమేమో లెక్కలు వేసిరి. తాటియాకుల గ్రంథములను దిరగవేసిరి. తుదకొకరి మొగమొకరు చూచుకొని పెదవి విఱచి మిన్నకుండిరి. ప్రోలరాజు గ్రుచ్చి గ్రుచ్చి యడుగుటచే వారు తప్పకొనజాలక "ప్రభూ! నీ కుమారుడు దీర్ఘాయుష్మంతుడగును. తండ్రిని మించిన కొడుకనిపించుకొనును. కాని తమ కతని చేతిలో మృత్యువు వ్రాసిపెట్టియున్నది" అని తెలిపిరి. ప్రోలరాజు ఎట్టి విషాదమును దెలియరానీక వారిని సన్మానించి పంపివేసెను.

ప్రోలరాజు దుఃఖముతో క్రుంగిపోయెను. అతడు మంత్రులతో మంతనములు సలిపెను. ఆంధ్ర సామ్రాజ్యము స్థాపితమైనదే కాని స్థిరపడి యుండలేదు. ఇంటను బయటను శత్రువులు పొంచియుండిరి. అట్టి సమయమున ప్రోలరాజునకు హాని గల్గినచో తెలుగువారి యానలడి యానలగును. అందుచే శిశువును చంపివేయుట కర్తవ్యమని వారు బోధించిరి. కాని చేతులార నెవ్వరు ఆ ఘోర కృత్యమొనర్పగలరు? కడకు బాలుని అరణ్యములో వదలి వన్యమృగముల పాలు గావించుటకు నిర్ణయింపబడెను. కాని ప్రోలరాజు కడుపు తీపిని చంపుకొనలేక పోయెను. అతడొకనాటి అర్ధరాత్రమున శిశువును రాజధాని ఏకశిలా నగర సమీపమునగల స్వయంభూస్వామి ఆలయ మంటపమునొద్ద పరుండబెట్టి వచ్చెను.

మరునాటి ఉదయమున ఆలయ పరిచారకులు కెవ్వు కెవ్వుమని యేడ్చు ఆ పసిబిడ్డను చూచి పూజారుల కెఱుకపఱచిరి. పెద్ద పూజారి రుద్రజియ్యఅను నతడు సంతతి లేనివాడు. అతడా బాలకుని శివప్రసాదముగ గ్రహించి భార్య కప్పగించెను. ప్రోలరాజు ఏమియు నెఱుంగనివానివలె పూజారిని పొగడి "ఎవడైననేమి? పసిపాపడు. వానిని పెంచి పెద్దవానిజేసి విద్యాబుద్ధులు చెప్పించి పిదప సంసారమున కప్పగింపుడు. అప్పుడతడు స్వతంత్ర[illegible]గ జీవింపగలడు. మీకు పుణ్యము, పురుషార్థము రెండును సమకూడును. బాలుని పోషణమునకగు వ్యయమంతయు ప్రభుత్వమే భరింపగలదు" - అని సబహుమానముగ వీడ్కొలిపెను.

రుద్రజియ్య శిశువునకు రుద్రదేవుడని నామకరణ మొనర్చి అల్లారు ముద్దుగ పెంచుకొనుచుండెను. కన్న మోహముకన్న పెంచిన మోహమెక్కుడు కదా! బాలకుడును నాట బెరుగునది పూట బెరుగుచు ముద్దు మురిపెములతో పూజారి దంపతుల నలరించుచుండెను. రుద్రదేవుడు యుక్తవయస్కుడై వేదశాస్త్రాదికముల పాండిత్యము గడించెను. క్షత్రియోచితములైన శస్త్రాస్త్ర విద్యలను సాధించెను. నూనూగు మీసాల నూత్నయౌవనముతో సానబట్టిన జాతిరత్నమువలె నాతడు వెల్గొందుచుండెను.

అనుదినము వేకువనే లేచి స్వయంభూదేవు నర్చించి మఱలి వచ్చుట ప్రోలరాజు నిత్యకృత్యములలో నొకటి. నాడునట్లే చనుదెంచెను. పరివారము మామూలు ప్రకారము ప్రాకారము వెలుపల నిలిచిపోయెను. ప్రోలరాజు ఒంటరిగా లోనికెళ్ళి శివార్చనము ముగించెను. తిరిగివచ్చునప్పుడు మంటపమున నొక యువకుడు నిద్రించుచుండునట్లాతనికి కనపడెను. రాజు కుతూహలముతో వానిని సమీపించెను.

ఆ వ్యక్తి యెవ్వరో కాదు. రూపొందిన శౌర్యమోయన రుద్రదేవుడచ్చట శయనించియుండెను.

ప్రోలరాజింతకముందు రుద్రదేవునొంటిగా గలిసి యుండలేదు. అతనిలోని పుత్రప్రేమ పెల్లుబ్బి కట్టలు తెగి పొంగులు వారెను. కన్నకొడుకు నొక్కమారు ఆలింగనము చేసికొనవలెనని అతనికి బుద్ధి పుట్టెను. ఎంత యణుచుకొన్నను చిత్తవికార మాగినది కాదు. అతడు తత్తరముతో పల్యంకల గలయ జూచెను. కనుచూపు మేరలో నెవ్వరును లేరు. ఇంతకన్న నవకాశము లభించుట హుళక్కి. ప్రోలరాజు కాళ్లు తడబడుచున్నను లెక్కసేయక కొడుకును కౌగిలించుకొని శిరమును ముద్దుపెట్టుకొనెను.

రుద్రదేవుడు కలత నిద్దురలో నుండెను. మీదు మిక్కిలి యేదో దుస్స్వప్నము గనుచుండెను. అట్టి స్థితిలో ప్రోలరాజాతని పరిష్వంగము గోరెను. శత్రువు లెవ్వరో తనపై పడినారని రుద్రదేవుడూహించెను. త్రుళ్లిపడి లేచెను. మైకముతోనే మొలలోని బాకును తీసి ప్రోలరాజు వక్షమున గ్రుచ్చెను. ఈ యలజడి విని పరివారము లోన ప్రవేశించెను. ఆదృశ్యము చూసి వారు భయకంపితులైరి. కొందరచ్చట గాపుండిరి. కొందఱు పట్టణములోనికి దౌడుతీసిరి. దవానలమువలె నీవార్త వ్యాపించుటకెంతో కాలము పట్టలేదు.

పౌరు లెక్కడి పనులక్కడ కట్టిపెట్టి దౌడు తీయుచుండిరి. ఒకరికన్న నొకరు ముందడుగు వేయసాగిరి. ఒక్కక్షణములో పురజనులు స్వయంభూస్వామి యాలయమున చేరిరి. హత్య చేయబడిన వ్యక్తి తమ రాజని బోధపడెను. ఆయన వక్షస్థలమున నొక బాకు పిడివరకు గ్రుచ్చబడి యుండెను. హంతకుడు బిత్తరి చూపులతో విభ్రాంతుడై నిలువబడి యుండెను. ప్రజలలో ఉద్రేకము ఆకసమంటెను.

“చంపుడు, పొడువుడు, హంతకుని పట్టి చిత్రవధ నొనర్పుడు” అని ప్రజాసముద్రము ఏకకంఠముగ ఘూర్ణిల్ల జొచ్చెను.

అంతలో ప్రోలరాజు కన్నులు తెరచుకొనెను. ప్రాణవాయువు లింకను ఆతనిని వీడిపోలేదు. ప్రోలరాజు ప్రజల హృదయంలో పగ్గులిడుచున్న భావములను పసికట్టెను. రక్తక్షయ మగుటచే నాతడప్పటికే కడు నీరసించియుండెను. ఊపిరి బరువుగా వచ్చుచుండెను. శక్తినంతయు నొక్కమారు కూడదీసికొని అతడిట్లు పల్కెను. “పౌరులారా! నా ప్రజలకడ ఈ యవసాన దశలోన విషయము చెప్పనవసరము లేదు. ఈ సంగతి రెండవకంటి వానికి దెలియకుండ ఇన్నాళ్లు కప్పిపుచ్చితిని. హంతకు డెవడో కాదు- నా కుమారుడే! ఆంధ్ర సామ్రాజ్యమునకు భావిచక్రవర్తి!!”

రుద్రదేవుని జన్మవృత్తాంతమంతయు రాజు పూసగ్రుచ్చినట్లు నుడివెను. జ్యోతిష్కుల సిద్ధాంతము, మంత్రుల నిర్ణయము, వన్యమృగముల వాతబడవేయుట కిచ్ఛగింపక శిశువును శివాలయమున చేర్చుట, రుద్రజియ్య పెంపకము మున్నగు విషయములు ప్రజలకు దెలుపబడెను. శివార్చన మొనర్ప వచ్చిన రాజు రుద్రదేవుడు ఒంటరిగా నిద్రించుచుండ గాంచుట, పుత్రప్రేమ పట్టజాలక యాతనిని కౌగలించుకొనుట, పౌరులు గ్రహించిరి.

రుద్రదేవుడీ పని తెలిసి చేయలేదు. శత్రువెవ్వడో పైబడెనని కలత నిద్దురలో నీఘాత మొనర్చెను. విధి మొదటనే మన లలాటపట్టికను లిఖించి పెట్టును. ఆ వ్రాతను భగవంతుడే మార్చు చేయలేడు. మానవులు తప్పించుకొన జూచుట నగుబాటు కాదా! నేటితో నా కాయువు సరి. నా కుమారుడగు రుద్రదేవుని ఏకశిలారత్న పీఠిపై నభిషేకింపుడు. సామ్రాజ్యభారము వహించుటకితడు అన్ని విధముల సమర్థుడు” అని ప్రోలరాజు ప్రజలను కోరెను.

రుద్రదేవుడు తన పుట్టుపుగురించి యింత కథ యున్నదని యెఱుగడు. పూజారి దంపతులే తన జననీ జనకులని భావించి యుండెను. తాను నిరపరాధిని హత్య చేసితినని తోచినప్పుడే రుద్రదేవుని పై ప్రాణములు పైని పోయెను. ఆ వ్యక్తి యాంధ్ర సార్వభౌముడని విన్నప్పుడాతడు నిజముగా కొయ్యబారిపోయెను. సార్వభౌముడు తనతండ్రి

కేయని తెలిసినప్పుడాతని స్థితి ఎట్లుండునని చెప్పగలము?

"రాజద్రోహినే కాక పితృహంతకుడను కూడనా? శిక్ష సామ్రాజ్య ప్రదానమా!" అని రుద్రదేవుడు తండ్రిపైబడి విలపింప జొచ్చెను. ప్రోలరాజాతని సమ్మెను నిమురుచు "నాయనా! నివురు గప్పిన నిప్పువలె ఇన్నాళ్లు సామాన్యునింట పెరిగితివి. స్వార్థమునకై నిన్ను రాచఠీవిమునకు వెలి యొనర్చితిని. తెలియక చేసిన తప్పు నీది-తెలిసి చేసిన తప్పునాది. అంతయు నీశ్వరేచ్ఛ! త్రిలింగ సామ్రాజ్యమును స్థాపించుటకై నాజీవితమును వెచ్చించితిని. దాని నిప్పుడు నీ చేతులలో పెట్టి పోవుచున్నాను. నీశక్తిచే, నది స్థిరపడినప్పుడే తండ్రి ఋణము దీర్చుకొన్న వాడవగుదవు. అప్పుడే నా యాత్మయు తృప్తిచెందగలదనుచూ ప్రోలరాజు ప్రాణములు విడిచెను. ప్రజలు హాహారవములొనర్చుచు దుఃఖసముద్రమున మునిగిపోయిరి.

రుద్రదేవుడొక్క సుముహూర్తమున ఆంధ్ర సామ్రాజ్యమునకు పట్టాభిషిక్తుడయ్యెను. సామంత మండలాధిపుల తిరుగుబాటులణచివేయుటయే గాక సామ్రాజ్యమును నలుముఖముల విస్తరింపచేసి తగు కట్టుదిట్టములతో రాజ్యము స్థిరపడునట్లు చేసి తండ్రి యానతి నతురాల ఆంధ్రసామ్రాజ్యమును మహావైభవముగ పరిపాలించి తండ్రియగు ప్రోలరాజు ఆత్మకు తృప్తి కలిగించెను. ★


ఆ ముఖ కవళికను



పట్టుకోండి

Agfa ఇసోపాన్ అల్ట్రా

ఇది దృశ్యములను విస్పష్టముగాను అతి శీఘ్రముగాను తీయును.

అతి శీఘ్రంగా మారిపోయే ముఖ కవళికలు, వేగంగా కదిలిపోతుండే వస్తువులు, రాత్రిళ్లు ఫోటోలు, వెలుతురు సరిగా లేనప్పుడు తీయవలసిన 'క్లిష్ట' సమయమైన విషయములు, కొత్త అగ్ఫా ఇసోపాన్ అల్ట్రాతో సులభముగా ఫోటో తీయవచ్చును. ఈ ఫిలిం ఎంత వేగంగా ఫోటోలు తీస్తుందంటే, బయటి ఎక్స్పోజరు వగటున F-22 వంతున సెకండుకు 1/100 భాగంలో ఫోటోలు తీయవచ్చును. ఇంత వేగంగా పనిచేసినప్పటికి, ఈ అగ్ఫా ఫిలింవల్ల ఉత్తమమైన చిత్రములను అతి విస్పష్టముగా తీయవచ్చును కొద్దిగా ఎక్స్పోజరు లేనప్పటికి, సరిగా డెవలపింగ్ చేస్తే గ్రెయిన్ లేకుండా ఎన్లార్జిమెంట్లు తీసుకొనవచ్చును.




అసా స్పీడ్ రేటింగ్
పగటి వెలుతురు—200
కృత్రిమ వెలుతురు—400

అగ్ఫా ఇండియా
ప్రైవేట్ లిమిటెడ్.
బొంబాయి * న్యూఢిల్లీ * కలకత్తా
మద్రాసు.

AGFA 56.14.Tel.